నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 11, 2024 | www.navatelangana.com

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

తాంసి : గిరిగాం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ గంగారాం అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకొని శనివారం మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ టీపీసీసీ కార్యవర్గ సభ్యురాలు గండ్రత్ సుజాత మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగారాం తన జీవితకాలం కాంగ్రెస్ పార్టీలో ఉండి సర్పంచ్‌గా గ్రామానికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి వెంట జడ్పీటీసీ రాజు, వైస్ చైర్మన్ ధనుంజయ్, వివిధ పార్టీల నాయకులు కౌడాల నారాయణ, రాజబలి, రమణ ఉన్నారు.



రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిరికొండ

వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల వల్ల కొండాపూర్ గ్రామ సమీపంలోని చిక్మాన్ వాగుపై ఉన్న అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పట్లో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. దేశంలోనే ఆదివాసుల అతి పెద్ద నాగోబా జాతర ప్రారంభం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో శనివారం ఎమ్మెల్యే హోదాలో రోడ్డుకు తాత్కాలికంగా మొరం వేయించి బాగు చేయించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాహుల్, మెస్రం నగేష్, ఇమామ్, నవీన్, మల్లేష్ పాల్గొన్నారు.



బడ్జెట్ భారీ..అమలుపై ఆశలు..!

- ఆరు గ్యారెంటీల అమలుపైనే అందరి దృష్టి
- ఇందిరమ్మ ఇండ్లకు నిధుల కేటాయింపుతో ప్రయోజనం
- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలపై కదలిక
- పబ్లిక్ స్కూల్‌ల నిర్మాణానికి నిధుల కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ పద్దుపై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. జనాల్లోనూ నూతన సర్కారుపై భారీ అంచనాలు ఉన్నాయి. జనం ఆకాంక్షలు తీర్చాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో తొలి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2024-2025 ఏడాదికి గాను 2,75,891కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ భారీ బడ్జెట్‌పై ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కేవలం పద్దును భారీ స్థాయిలో అంకెల్లో వెల్లడించడమే కాకుండా ఖర్చు చేసి వాస్తవ రూపం దాల్చితే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకే తాజాగా బడ్జెట్‌లో తొలి ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పథకాల అమలుకు 53,196 కోట్లు కేటాయించడంతో జనాల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఇప్పటికే రెండు గ్యారెంటీలు అమలవుతుండగా.. మిగిలిన వాటిపైనా భరోసా కలుగుతోంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం నిధులు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది గూడులేని నిరుపేదలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు సంక్షేమ రంగాలకు సైతం నిధులు కేటాయించడంతో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లావాసులను కేంద్రం బడ్జెట్ నిరాశ పర్చినా..రాష్ట్ర పద్దుపై మాత్రం ఆశలు పెట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం సైతం భారీ స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టినా..వాటిని ఖర్చు చేయడంలో మాత్రం పూర్తిస్థాయిలో సఫలం కాలేదనే విమర్శలున్నాయి. తాజాగా రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం భారీ అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో హామీనిచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో పాటు సంక్షేమ రంగాలపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. తాజాగా ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో 53,196కోట్లు కేటాయించడంతో లబ్దిదారుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఇది వరకే వీటికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించడంతో ఉమ్మడి జిల్లాలో 8,92,507 మంది దరఖాస్తులు అందించారు. తాజాగా ఈ పథకాల అమలుకు నిధులు కేటాయించడంతో అమలుపైనే అందరు ఆశలు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు కాగా.. ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు వర్తింపజేస్తోంది. వీటితో పాటు గృహజ్యోతి పథకానికి లబ్దిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ పథకం ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షలకు పైగా మంది దరఖాస్తులు చేశారు. మిగితా రైతుభరోసా, చేయూత, యువ వికాసం, గృహజ్యోతి పథకాలకు నిధులు కేటాయించనుంది.

ఇందిరమ్మ ఇండ్లపై ఆశలు..!

ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం రూ.7740కోట్లు కేటాయించింది. తొలి విడతలో నియోజకవర్గానికి 3500చొప్పున ఇండ్ల నిర్మాణం చేపడుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో ఈ పథకం కింద 35వేల మందికి ప్రయోజనం చేకూరనుంది. అనేక మంది వీటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా విద్యారంగానికి రూ.21.389కోట్లు కేటాయించడంతో గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు- మనబడి కింద బడుల్లో ఆధునాతన సౌకర్యాలపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి తాజా బడ్జెట్‌లో రూ.500కోట్లు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలోని 70 మండలాల్లో వీటి నిర్మాణాలు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. గురుకుల భవనాలు, సంక్షేమ హాస్టళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతుండటంతో పేద విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఆయా వర్గాల వారీగా నిధులు కేటాయించింది. దీంతో గతంలో మాదిరిగా ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణ సాయం వంటిని లభిస్తాయని ఆయా వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.



తుమ్మిడిహేటి ప్రాజెక్టు నిర్మాణ స్థలం

ప్రాజెక్టులపై గంపెడాశలు..!

ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం నీటి పారుదల రంగానికి రూ.28.02కోట్లు కేటాయించడంతో ప్రాజెక్టుల పూర్తిపై ఆతృత నెలకొంది. ముఖ్యంగా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లికి వచ్చిన సందర్భంలోనూ ఉమ్మడి జిల్లాలోని తుమ్మిడిహేటి, సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులను నిర్మిస్తామని, కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తాజాగా ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని తెలుస్తోంది. వీటితో పాటు కొమురంభీం ప్రాజెక్టు కాల్వల నిర్మాణం, చనక-కోర్ట బ్యారేజీకి డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటితో పాటు పలు ప్రాజెక్టుల కాల్వల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. తాజాగా వీటికి మోక్షం లభించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటితో పాటు వివిధ రంగాలకు ప్రభుత్వం నిధులు కేటాయించడమే కాకుండా వాటిని సకాలంలో విడుదల చేసి ఖర్చు చేస్తేనే ఫలితం ఉంటుందని ఉమ్మడి జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.



తుమ్మిడిహేటి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు(ఫైల్)

ఇది పేదల సంక్షేమ బడ్జెట్ : బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టింది. ప్రభుత్వానికి వచ్చే రాబడి తిరిగి ప్రజల కోసమే వెచ్చించనుంది. ముఖ్యంగా ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసే దిశగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభ పరిణామం. ఈ బడ్జెట్‌తో నిరుపేదల ఆకాంక్షలు నెరవేరుతాయి.



కేటాయించిన నిధులు ఖర్చు చేయాలి : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం 2024-25 ఏడాదికి గాను వివిధ పథకాలు, శాఖలకు కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా కచ్చితంగా ఖర్చు చేయాలి. జిల్లాను దత్తత తీసుకున్నామని చెప్పిన ప్రభుత్వం ఇందులో ప్రత్యేకంగా నిధులు కేటాయించ లేదు. జిల్లాను పారిశ్రామికరంగా, వ్యవసాయపరంగా ఎలా అభివృద్ధి చేస్తారో చెబితే బాగుండేది.

పోరాట ఫలితమే తునికాకు టెండర్లు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తాము చేసిన పోరాటాల ఫలితంగానే జిల్లాలో తునికాకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ అటవీ ప్రాంతంలో ఆదివాసులు, ఇతర పేదలకు వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ రెండవ పంటగా, ఆదాయ వనరుగా ఉందన్నారు. 2024 సంవత్సరానికి జిల్లాలో అటవీ అధికారులు పెద్దపులి సంచరిస్తుందనే నెపంతో ఆకు సేకరణ నిలిపేయాలని ఉన్నత అధికారులకు గతంలో సిఫార్సు చేసిన విషయం తెలిసిందేనన్నారు. దీంతో టీఏజీఎస్‌తో కలిసి తునికాకు టెండర్లు పిలవాలని జిల్లా కార్యాలయం ఎదుట గతంలో ధర్నా చేసి అటవీ అధికారికి వినతి పత్రం అందించినట్లు వివరించారు. తమ పోరాటం ఫలితంగా ఆసిఫాబాద్ డివిజన్‌లో రెండు యూనిట్లు(22 కల్లాలు), కాగజ్‌నగర్ డివిజన్‌లో 13 యూనిట్లు 157 కల్లాలకు టెండర్లు పిలిచారని అన్నారు. ఇది తమ పోరాట ఫలితమేనన్నారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో మిగిలిన 10యూనిట్లకు కూడా టెండర్లు పిలవాలని, లేకపోతే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీలకు పెండింగ్‌లో ఉన్న బోనస్ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలాశ్రీ పాల్గొన్నారు.

13న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలి



నవతెలంగాణ - కౌటాల

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి దుర్గయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో జిల్లా సదస్సు వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జిల్లాకేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో నిర్వహించే జిల్లా సదస్సుకు రాష్ట్ర, జిల్లా నాయకులు రానున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. కౌటాల, చింతలమానేపెల్లి మండలాల ఉపాధ్యాయులు సదస్సుకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఇరు మండలాల అధ్యక్షులు సఫల్, ప్రశాంత్, మహేందర్, గౌరవ్, ఎస్‌డబ్ల్యుఎఫ్ కన్వీనర్ పృథ్వి, రాజన్న, పరమేశ్వర్, సంతోష్, హరీష్, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అమరావతి హాకీ టోర్నమెంట్‌కు జిల్లా క్రీడాకారులు



ఆదిలాబాద్‌టౌన్ : మహారాష్ట్రలోని అమరావతిలో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆదిలాబాద్‌కు చెందిన హాకీ క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. అమరావతిలో ఈ నెల 11 నుంచి జరిగే ప్రైవేట్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లిన క్రీడాకారులకు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి చేయూత అందించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులను ప్రోత్సహించేలా తన సొంత డబ్బులతో వారిని శనివారం పంపించారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్‌లు రవి, శేఖర్, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, మేనేజర్ హిజాజ్ పాల్గొన్నారు.

వికలాంగులకు బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరం

కాగజ్‌నగర్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్డీ) జిల్లా గౌరవ అధ్యక్షులు ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో వికలాంగులకు నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులను మోసం చేసిందని విమర్శించారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 5శాతం ప్రకారం రూ.13,794.55 కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతున్న ఆసరా పెన్షన్స్‌కు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని, డిసెంబర్ నుండే పెంచిన ఆసరా పెన్షన్స్ పంపిణీ చేస్తామని చెప్పి బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు.

పీవీటీలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పివిటిజిలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శనివారం పివిటిజిలకు అందించే వైద్య సేవలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పివిటిజిలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద వైద్య సేవలు అందించేందుకు ఒప్పంద పద్ధతిన వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లను నియమించడం జరిగిందని, జిల్లాలోని మారుమూల పివిటిజి గ్రామాలకు వైద్య సేవలు అందించేందుకు మొబైల్ హెల్త్ వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ వాహనం ప్రతి రోజు ఉదయం 8గంటలకు ఆయా గ్రామాలలో ఉండి వైద్య సేవలు అందించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకొని ఆ ప్రకారంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పివిటిజిలతో మమేకమై మర్యాదగా ప్రవర్తిస్తూ వైద్య సేవలపై వారికి అవగాహన కల్పించాలని, గ్రామాల్లోని ప్రతి పివిటిజి కుటుంబాన్ని సందర్శించి ఆరోగ్య సమస్యలపై వివరాలు తెలుసుకోవాలని, అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, వెంకటి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నవీన్ యాదవ్, బద్దం పురుషోత్తంరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, సమన్వయకర్త ప్రతాప్‌సింగ్, పలువురు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొని కళాశాలలో నెలకొన్న సమస్యలు, కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. గతంలో సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్‌లోనూ కళాశాల అభివృద్ధికి తోడ్పడుతామని పేర్కొన్నారు. సంఘం క్యాలెండర్‌ను రూపొందించి ప్రతి నెల చేపట్టే కార్యక్రమాలు అందులో ఉంటాయన్నారు. రాబోయే మార్చి, ఏప్రిల్‌లో కెమిస్ట్రీ, హిందీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సెమినార్లకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌కు అవసరమైన కంప్యూటర్లు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని లేదా తానే సొంతంగా ఐదు కంప్యూటర్లు సమకూరుస్తానని రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల నిపుణులు బద్దం పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి కళాశాలకు అవసరమైన సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథ్, సంతోష్ కుమార్, రమేష్, నర్సింగరావు, విజయకుమార్, అనిత, జ్యోత్స్న సాయిప్రసాద్, తిరుపతి, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, మురళీధర్ హాజరయ్యారు.

అనాథ అక్కాచెల్లెళ్లను ఆదుకున్న యూత్ సభ్యులు



నవతెలంగాణ - కౌటాల

అనాథలుగా మారిన అక్కాచెల్లెళ్లను ఎస్ఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ యూత్ సభ్యులతో కలిసి ఆసరాగా నిలిచారు. పోలీసుల సహకారంతో అనాథలుగా ఉన్న అక్కాచెల్లెళ్లకు అండగా నిలిచిన యువకులను ఎస్ఐ మధుకర్ అభినందించారు. యూత్ సభ్యులు వారికి ఆహార ధాన్యాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సేవ చేయాలనే తపనతో కష్ట సమయంలో నిరుపేద కుటుంబాలకు, అనాథలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. మండలంలోని బోదంపెల్లి గ్రామానికి చెందిన రామిల్ల లక్ష్మి, రామిల్ల శ్యామల తల్లిదండ్రులు 10 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోగా అప్పటి నుండి లక్ష్మి కూలి పని చేసుకుంటూ కడు పేదరికంతో నానా ఇబ్బందులు పడుతోందన్నారు. రామిల్ల లక్ష్మికి మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తితో పెళ్లి కాగా భర్త కొంతకాలంగా మద్యానికి బానిసై హింసించడంతో ఎ ౹ ట ్బ ం ట ి క ి వచ్చేసిందన్నారు. చెల్లి రామిల్ల శ్యామలకు మూడు సంవత్సరాల క్రితం పక్షవాతం రావడంతో కాళ్లు, చేతులు పనిచేయకుండా పోయాయి. మానసిక స్థితి సైతం క్షీణించడంతో మాటలు రాక మానసికంగా బాధపడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్ఆర్ఎస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మేమున్నామంటూ ముందుకొచ్చి నెలకు సరిపడా ఆహార వస్తువులు, రూ.3500 నగదు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో యూత్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, సభ్యులు పురుషోత్తం, విలాస్, పుండలిక్, తిరుపతి పాల్గొన్నారు.

పీవికి భారతరత్న సంతోషకరం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మాజీ ప్రధాని, బహు భాషాకోవిదుడు, రాజకీయ చతురుడు, ఆర్థికవేత్త, మేధావి, తెలుగువాడైన పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డుకు ఎంపిక చేయడం తెలంగాణా ప్రజలకు అత్యంత సంతోషాన్ని కలిగించిందని సీనియర్ సిటిజన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.నరసింహారావు, కార్యదర్శి మార్త సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన వ్యక్తికి దేశ అత్యున్నత పురస్కారం దక్కడ రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు.

15న సేవాలాల్ జయంతికి పీఓకు ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

15న నిర్వహించే సేవాలాల్ జయంతికి ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాని మర్యాదపూర్వకంగా కలిసి సేవాలాల్ జయంతికి రావాలని సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ మహేందర్ ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓను కలిసి మొక్కను



అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవకమిటీ సభ్యులు మాట్లాడుతూ జీసీసీ పెట్రోల్ బంక్ ప్రక్కన ఉన్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి నిధులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్ సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు, సలహాదారులు ఎంపీటీసీ జాదవ్ గోపాల్‌రావు, న్యాయవాది బానోత్ జగన్, పవార్ విజేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించిన స్నేహితులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన బిట్లింగ్ సంతోష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనతో కలిసి చదువుకున్న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు శనివారం మృతుని కుటుంబానికి నలభై వేయిల రూపాయలు నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సాయికృష్ణ, చక్రపాణి, సంజయ్, గణేష్, భూషణ్‌చారి, అనిల్, సాయిరాం, రవీందర్, సుధీర్, శ్రీధర్, గంగాధర్, జనార్దన్, నరేందర్, గంగా ప్రసాద్ పాల్గొన్నారు.



పారపట్టి మురుగు కాలువలను శుభ్రం చేసి



నవతెలంగాణ-ఉట్నూర్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని నేను సైతం అంటూ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు స్వయంగా పారచేతపట్టి మురుగు కాలువలను తీస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం మండలంలోని ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని చింతగూడ గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని అన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత ఉంటేనే రోగాలు దరిచేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఘన్‌పూర్‌కు చెందిన పంద్ర లచ్చు, మాజీ వార్డు సభ్యులు, కొట్నాక్ జగన్, పంద్ర మనోహర్, అర్క దేవు, సిడం మోతిరాం, పంద్ర నాగోరావు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి స్వల్పంగా పెరిగిన ప్రాధాన్యత

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను శనివారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు గతం కంటే పెరిగిందని హర్షం వ్యక్తం చేస్తున్నట్టు టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం బడ్జెట్‌లో రూ.21,389 కోట్లు విద్యారంగానికి కేటాయించారని గతేడాది కంటే మెరుగ్గా కేటాయించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కాని కాంగ్రెస్ చెప్పిన విధంగా బడ్జెట్‌లో 15శాతం కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు.

నిధులను ఆయా శాఖలు కచ్చితంగా ఖర్చు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలకు, ఆయా శాఖలకు కేటాయించిన నిధులను కచ్చితంగా ఖర్చు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో వివిధ పథకాలకు, శాఖలకు కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా చూడాలని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నామన్న ప్రభుత్వం ప్రత్యేకమైన నిధులు ఏమీ కేటాయించలేదని ఆరోపించారు. జిల్లాను పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా, అభివృద్ధి ఎలా చేస్తారో తెలియజేయాలని కోరారు.

శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల అందజేత



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో వివిధ కోర్సులలో శిక్షణను పూర్తిచేసుకుని ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జన శిక్షణ సంస్థ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ వర్ని సంతోష్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బేల పంచాయతీ కార్యదర్శి గజానన్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ద్వారా అందించే శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న వృత్తిని కొనసాగిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. యువతీ, యువకులు ప్రభుత్వం ద్వారా అందించే శిక్షణలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్, బ్యూటిషన్, మగ్గం టీచర్లు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

నిందితుడి తరపున వాదించొద్దు



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన యువతి శెట్టిపల్లి అలేఖ్యను అత్యంత దారుణంగా నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా కత్తితో నరికి చంపిన నిందితుడు శ్రీకాంత్ తరపున న్యాయవాదులు వకాలత్ తీసుకోవద్దని మృతురాలి కుటుంబ సభ్యులు శనివారం బార్ అసోసియేషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. అలేఖ్యను ఎలాగైనా చంపుదామని మూడు నెలల క్రితమే కత్తిని తయారు చేసుకొని ప్రణాళిక ప్రకారం కక్షతో మట్టుపెట్టిన నిందితుడు శ్రీకాంత్‌కు కఠిన శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. అలేఖ్యతో పాటు ఆమె వదినే జైశీలతో పాటు మూడు సంవత్సరాల బాలునిపై సైతం కర్కశంగా విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి గాయపరిచాడని అన్నారు. న్యాయవాదులు ఇలాంటి క్రూరమైన వ్యక్తుల పట్ల కఠినంగా ఉండాలని కోరారు. ఇందులో మృతురాలి కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మంత్ర రాజం, సురేష్, కిషోర్ నాయక్, షబ్బీర్, భాష, రాజశేఖర్ ఉన్నారు.

జలాభిషేకంతో పులకించిన నాగోబా..!

- అర్ధరాత్రి నాగోబాకు జలాభిషేకం
- మెస్రం కోడళ్ల భేటింగ్
- గోవాడలో కొత్త కుండల్లో వంటకాలు
- రేపు పెర్సాపేన్ పూజలు



నాగోబా అభిషేకానికి హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మెస్రం వంశీయులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద జాతరగా పేరు గాంచిన కేస్లాపూర్ నాగోబా జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ నెల 15 నుంచి 16 వరకు ఈ జాతర అధికారికంగా జరుగుతోంది. ఈ జాతరకు ఉమ్మడి జిల్లా ప్రజలే గాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా హాజరవుతారు.

నాగోబాకు మహాజలాభిషేకం...

నాగోబా పుష్య అమావాస్య రాత్రి మెస్రం పూజారులు ఖటోడ (పూజారులు), మెస్రం కోసేరావ్, హన్మంతు, ధర్ము ప్రధాన్‌జీ దాడి రావ్, కొత్వాల్ తిరుపతిల ఆధ్వర్యంలో మందిరాన్ని శుద్ధి చేశారు. అనంతరం సాంప్రదాయ వాయిద్యాల మధ్య పూజలు నిర్వహించారు. ఈ పూజలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు ఐటీడీఏ ఇన్‌చార్జీ పీఓ ఖుష్బు గుప్త, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్, ఎస్పీ గౌస్‌ఆలం, ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్మెన్ కోనేరు కృష్ణారావ్, మంచిర్యాల అదనపు కలెక్టర్ తివారి హాజరయ్యారు.

101 కోడళ్ల భేటింగ్....

నాగోబా మహా పూజ అనంతరం అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు మెస్రం వంశీయుల కొత్త కోడళ్ల భేటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నాగోబా సన్నిధిలో తమ కుల పెద్దలకు పాదాభివందనం ఆశీర్వదించారు. ఈ సంవత్సరం 101 మంది కోడళు బేటింగ్ చేశారు. అనంతరం నాగోబాను దర్శించుకున్నారు. బేటింగ్ అయిన తరువాతనే మెస్రం కోడళ్లు నాగోబా దర్శనానికి అర్హులు.

కొత్త కుండల్లో వంటకాలు...

గోవాడలో బస చేసిన మెస్రం వంశీయులు 22 కితాల (వర్గాలు) వారిగా నైవేద్యం కోసం దంపుడు బియ్యం, పప్పు, బెల్లం, జొన్న పిండితో నవ ధాన్యాలను సేకరించారు. 22 పొయ్యిలు ఏర్పాటు చేసి వంటకాలను తయారు చేశారు. ఈ వంటకాలతో తయారు చేసిన నైవేద్యాన్ని దేవునికి సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షను విరమింప చేశారు. రేపు ఆదివారం నాడు పెర్సాపేన్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు.







పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదో తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి, జరుగుతున్న పదో తరగతి జీవశాస్త్ర పరీక్షను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వందశాతం హాజరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరై, చక్కగా చదివి, ఉపాధ్యాయులు నిర్వహించే విషయాల వారి స్లిప్‌టెస్ట్‌లను బాగా రాయాలని పేర్కొన్నారు. విద్యార్థులు మన జిల్లా నుంచి అత్యధికంగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించాలని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు విషయాల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిని దత్తత తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేసి, వందశాతం ఉత్తీర్ణులు అగునట్లు చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా తరగతి గదిలో ఉన్న ఐఎఫ్‌పీ ప్యానెల్ పనితీరును, ఉపయోగించే విధానాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో నిర్మించబడిన డైనింగ్ హాల్‌ను, మధ్యాహ్న భోజన సరుకుల నాణ్యతను, మధ్యాహ్న భోజనం వండే తీరును పరిశీలించారు. తాజా కూరగాయలు, నాణ్యమైన వస్తువులను ఉపయోగించి, మెనూ ప్రకారం పోషకాలతో కూడిన శుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచించారు. భోజన వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉండునట్లు చూడాలన్నారు. పదో తరగతికి నిర్దేశించిన ప్రత్యేక ప్రణాళిక సరిగా అమలు అయ్యేలా చూడాలనీ, ప్రత్యేక తరగతులను పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీలత, డీపీఆర్వో తిరుమల, గ్రామ పెద్దలు, ప్రధానోపాధ్యాయులు, అశోక్ వర్మ ఉపాధ్యాయులు ఉన్నారు.

అసెంబ్లీలో సీసీఐ, ఆర్మూర్ రైల్వే లైన్ ప్రస్తావించాల్సింది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ సమావేశాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఎయిర్ పోర్ట్ గురించి ప్రస్తావించడాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వేలైన్ గురించి, తలమానికంగా ఉన్న సీసీఐ ఫ్యాక్టరీ గురించి కూడా ప్రస్తావించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా సీసీఐ పునరుద్ధరణ కోసం గత రెండు ఏండ్లుగా పోరాటం జరుగుతుందన్నారు. గత నెల రోజులుగా రైల్వే లైన్ సాధన కోసం ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ రెండు పోరాటాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించడంలో కేంద్రం, బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లా నుంచి పార్లమెంట్ సభ్యుడితో పాటు, తాజాగా ఆదిలాబాద్ అసెంబ్లీకి బీజేపీ అభ్యర్థులను గెలిపించిన జిల్లా ప్రజల పట్ల బీజేపీ సవతి తల్లీ ప్రేమను కనబరుస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండిచెయ్యి చూపిందన్నారు. సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరు చేయకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, నాయకులు ఎస్.స్వామి, కె.ఆశన్న పాల్గొన్నారు.



కేస్లాపూర్‌లో పైపుల లీకేజీ, కనిపించని క్లోరినేషన్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఏర్పాట్లపై ఆయా శాఖ సమన్వయం చేస్తూ, సమీక్షా సమావేశాలను నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి నాగోబాకు మహాజలాభిషేకాన్ని చేసి గోవాడకు చేరుకున్నారు. మొదటి రోజే భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అక్కడ వారికి, తాగు నీటి సౌకర్యంతో పాటు స్నానపు నీరు, మరుగుదొడ్లుకు సరిపడ నీటిని అందించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉంది. అయితే మొదటి రోజునే గోవాడ పరిసర ప్రాంతంలో స్నానపు వాటికలు, మరుగుదొడ్ల వద్ద పైపులైన్‌లు లీకేజీలు ఏర్పడటంతో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాల్సిన అధికారులు చేయడం లేదని భక్తులు పేర్కొంటున్నారు. దీంతో పరిసర ప్రాంతంలో దుర్గంధాన్ని వెదజల్లుతోంది. అక్కడి నీటి కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అంజనిపుత్ర రియల్ ఎస్టేట్స్ కంపెనీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం విలేజ్ 11 వర్సెస్ జైనథ్ విలేజ్ మధ్య పోటీలు జరిగాయి. ఈ పోటీలను అంజనిపుత్ర రియల్ ఎస్టేట్స్ సీజీఎం లావణ్య మహేష్ పాల్గొని, టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం విలేజ్ 11 టీమ్ కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకోగా, జైనథ్ టీమ్ బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజనిపుత్ర కంపెనీ సభ్యులు కంకటి కృష్ణ, జంగం మహేష్, మల్యాల కృష్ణకాంత్, కంపెల్లి శ్యామ్, మల్యాల సంప్రీత్, కేమ గంగయ్య కంపెల్లి, సత్యా పాల్గొన్నారు.

గ్రూప్ 4లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని కరంజి గ్రామానికి చెందిన భక్కి మమత రమేష్ యాదవ్‌ల కుమారుడు సాయికృష్ణ యాదవ్ గ్రూప్-4 ఫలితాల్లో రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించాడు. తండ్రి రమేష్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్, సాయికృష్ణ ప్రాథమిక ఉన్నత కళాశాల ఆదిలాబాద్‌లో పూర్తి చేశాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయులు, లెక్చరర్లు అందించిన ఉత్తమ బోధన గ్రూప్ 4ను సాధించాలని ఒక పట్టుదలతో మూడో ర్యాంకు సాధించాడని పేర్కొన్నారు. ఉద్యోగం చేస్తూనే మరింత ఉన్నతమైన ఉద్యోగాలు సాధించుటకు ఉద్యోగ పరీక్షలు రాస్తానని ఆయన తెలిపారు. తన కుమారునికి రాష్ట్రస్థాయి ర్యాంకుపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



కొనసాగుతున్న రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ సర్వే



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలోని బట్టి సవర్గాం గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బ, జయశంకర్ కాలనీల్లో శనివారం 2వందల యూనిట్స్ ఉచిత విద్యుత్‌పై సర్వే కొనసాగుతోంది. దీని కోసం ఆయా వార్డుల్లో మీటర్ నెంబరు, ఆధార్ కార్డ్ నెంబరు, ఫోన్ నెంబరు, ప్రజాపాలన దరఖాస్తు ఫారం నెంబరు, మొబైల్‌లో ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని నోడల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ జనార్దన్, జూనియర్ అసిస్టెంట్ లింగన్న, లైన్‌మెన్ మల్లేష్, విద్యుత్ సిబ్బంది బాబురావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ హెల్పర్ మృతి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ హేమలత శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ భాగ్యవతి ప్రభుత్వం తరపున మృతురాలి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. బాధిత కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-జైనథ్

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దేవల్ల సాయికుమార్(28) మద్యం మత్తులో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. విలేకరిగా చేస్తూ వ్యవసాయం చేసేవాడు. శుక్రవారం రాత్రి తమ పంట చేనులో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుం సభ్యులు అతడిని రిమ్స్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-వాంకిడి



కేవీపీఎస్ రాష్ట్ర డైరీని మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సైలు సాగర్, తేజశ్విని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవీపీఎస్ డైరీలో మహనీయులు డాక్టర్ భారతరత్న బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపులే, చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జీవిత చరిత్రలు, ప్రజలకు ఉపయోగపడే విధంగా చట్టాలు, రిజర్వేషన్ పలు విషయాలు పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శిశుమందిర్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు సరస్వతి శిశుమందిర్ విద్యార్థిని కాంద్రే కనిష్క ఎంపికైంది. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు చిలువేరు వెంకన్న అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చిలువేరు వెంకన్న మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కనిష్క రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు వేణుగోపాల్, మధుకర్, శ్రీనివాస్, సంతోష్, ప్రభాత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

- గ్రూప్(4)లో జిల్లాలో 17వ ర్యాంకు సాధించిన రాకేష్

నవతెలంగాణ-బెజ్జూరు



కష్టపడి చదివితే ఎదైనా సాధించవచ్చని మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన దూపం రాకేష్ నిరూపించారు. పేద కుటుంబానికి చెందిన రాకేష్ ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని పట్టుదలతో కష్టపడి చదివి ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మర్తిడికి చెందిన దూపం హన్మంతు, మంజుల దంపతుల కుమారుడు రాకేష్ గతంలో రైల్వే గ్రూప్(డి) పరీక్ష రాయగా దానిలో ఉత్తీర్ణత సాధించి ఎంపికయ్యాడు. అనంతరం తెలంగాణ కానిస్టేబుల్‌లో పరీక్ష రాయగా జైల్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా గ్రూప్-4 పరీక్ష రాసి సంవత్సరం గడిచిన తర్వాత ప్రభుత్వం మెరిట్ జాబితా విడుదల చేయగా ఇందులో కూడా తన సత్తాను చాటాడు. రాష్ట్రవ్యాప్తంగా 2697వ ర్యాంకు సాధించగా కుమురం భీం జిల్లాలో 17వ ర్యాంకు సాధించాడు. దీంతో ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు, మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షల్లో కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం కష్టమేమీకాదని ఈ సందర్భంగా రాకేష్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న పాన్‌షాప్ యజమాని



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

దహేగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన దాసరి ఉదయ కిరణ్ శుక్రవారం రాత్రి తన పర్సును కాగజ్‌నగర్‌లో పోగొట్టుకున్నాడు. పట్టణంలోని లారీ చౌరస్తా వద్ద గల పాన్ షాప్ యజమాని కోట దాస్‌కు తన షాపు ఎదుట రోడ్డుపై పర్సు దొరికింది. దానిని తెరిచి చూడగా అందులో రూ. 11 వేల నగదు, ఆధార్ కార్డ్, క్రెడిట్ కార్డు, ఐడీ కార్డు ఉండడంతో వెంటనే టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సీఐ తుత్తురు శంకరయ్యకు అప్పగించాడు. పర్సును శనివారం ఉదయం సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్యల సమక్షంలో దాసరి ఉదయ్ కిరణ్‌కు కోట దాస్ అప్పగించారు. నిజాయతీ చాటుకున్న కోట దాస్‌ను సీఐ, ఎస్సైలు అభినందించారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



నవతెలంగాణ-రెబ్బెన

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ కోరారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తిర్యాణి మండలకేంద్రంలో సమ్మె వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తి అయిందని, ఈ కాలంలో కార్మికులు, కర్షకులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి హామీని నిలబెట్టుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను దిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలందరికి తెలియజేయాలన్నారు. బీజేపీ హయాంలో నిరుద్యోగం 50 సంవత్సరాల గరిష్ఠ స్థాయికి చేరిందని, కార్మికుల వేతనాలు 20 శాతం తగ్గిపోయాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను యదావిధిగా కొనసాగించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మిక వర్గానికి సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రయివేటీకరణను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సింగం మొగిలిగౌడ్, జిల్లా నాయకుడు సత్తయ్య మండల కార్యదర్శి రంగు లచ్చాగౌడ్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో లంబాడిగూడ విజేత



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని లంబాడిగూడ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో లంబాడిగూడ జట్టు విజేతగా నిలిచింది. శనివారం ఫైనల్ మ్యాచ్‌లో సులుగుపెల్లితో తలపడిన లంబాడి జట్టు విజయం సాధించింది. దీంతో గెలుపొందిన జట్టుకు బీజేపీ నాయకులు మొదటి బహుమతి రూ. 15వేల నగదుతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు సంతోష్, రమేష్, దిలీప్ బిక్షపతి, ఆత్రం రామయ్య పాల్గొన్నారు.

గృహజ్యోతి సర్వేకు సహకరించాలి

నవతెలంగాణ-రెబ్బెన

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రతి ఒక్కరు సిబ్బందికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఎలక్ట్రిసిటీ బిల్లు, మొబైల్ నెంబర్, ప్రజాపాలన దరఖాస్తు రసీదు నెంబర్ అందివ్వాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సెక్టోరియల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని, కేటాయించన విధులు అధికారులు భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలపై కార్యాచరణ రూపొందించాలని, సహాయక పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది సంఖ్య పెరుగుతుందన్నారు. అధికారులకు కేటాయించిన రూట్ మ్యాప్‌లను పాటించాలని, తహశీల్దార్లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ రోజు ఈవీఎం సమస్య తలెత్తితే పోలింగ్ ప్రక్రియలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లపై పర్యవేక్షించాలని, పోలింగ్ రోజు ముందస్తుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని, అధికారులు తమకు కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. 17సీ డైరీపై అవగాహన కలిగి ఉండాలని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ఎన్నికల సంబంధిత అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, సెక్టోరియల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ బొర్కడే హేమంత్



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తెలుసుకోవాలి..

కాగజ్‌నగర్ రూరల్ : లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నియమించిన సెక్టార్ ఆఫీసర్లకు శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు వారికి కేటయించిన పోలింగ్ కేంద్రాలను వారం రోజుల్లో పర్యటించి కనీస మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు. టాయిలెట్స్, ర్యాంప్, రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, తదితర అంశాలను పరిశీలించి ఏఆర్‌ఓలకు నివేదిక అందించాలన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతల పట్ల పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఎదురైనా అనుభవాలను సమీక్షించుకొని విశ్లేషించి మెరుగైన పరిష్కారాలను కనుగొనాలన్నారు. ఆర్డీఓ సురేష్ మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో ఎలక్షన్లు విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలను సెక్టార్ అధికారులు చేపట్టాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు భరత్, ఉప్పులేటి శ్రీనివాస్, ఆసిఫ్, లతీఫ్, వీరశంకర్, శాంతి కుమార్, కొయ్యడ శ్రీనివాస్, తిరుపతయ్య, తిరుపతి, బాలకృష్ణ బాధ్యతలు, నిర్వహణలో వారి పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వన్యప్రాణులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలి

- నేషనల్ సెక్యూరిటీ ఆడిట్ బృందం అధికారి అలోక్‌కుమార్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ ప్రాంతాల్లో సంచరించే వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని, వాటికి అవసరమయ్యే నీటి వసతి, వేటగాళ్ల బారిన పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిఘా పెట్టాలని నేషనల్ సెక్యూరిటీ ఆడిట్ బృందం అధికారులు అలోక్‌కుమార్, యోగేష్ అన్నారు. శనివారం సిర్పూర్ రేంజ్ పరిధిలో ఇటుకల్ పహాడ్ బీట్‌ను పరిశీలించారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఇటుకల్ పహాడ్ అటవీ ప్రాంతంలో కొన్ని రోజుల క్రితం ఏర్పాటుచేసిన ప్లాంటేషన్, మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వు నుండి కవ్వాల్ టైగర్ రిజర్వులో పులులు ప్రవేశించే ప్రదేశాలను పరిశీలించి పులులు, వన్యప్రాణుల రక్షణపై అధికారులకు సూచనలు చేశారు. వీటిని వేటగాళ్ల నుండి రక్షించడంతో పాటు వేసవికాలంలో తాగునీటి కొరత, పచ్చికబయళ్లు ఏర్పాటుచేసి వాటిని కాపాడుకోవాలని తెలియజేశారు. అనంతరం సిర్పూర్ రేంజ్ ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ పులుల సంరక్షణ, ప్లాంటేషన్ గురించి వారికి వివరించారు. వాటి నిర్వహణపై నేషనల్ సెక్యూరిటీ అటవీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అబ్దుల్ ముసావీర్, సెక్షన్ అధికారి సద్దాం హుస్సేన్, బీట్ అధికారులు నరేష్, షాహిద్ పాల్గొన్నారు.



నీటి కొలనును పరిశీలిస్తున్న నేషనల్ సెక్యూరిటీ ఆడిట్ బృందం

రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటాలి

- జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయ బాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైన్స్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటాలని జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలోశనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయిసైన్స్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారు ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉపన్యాసం, పాటల, చిత్రలేఖనం, కవిత్వం పోటీలలో ఒక్కొక్క విభాగం నుండి ముగ్గురు చొప్పున 12 మంది రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. న్యాయ నిర్ణేతలుగా గుర్రాల వెంకటేశ్వర్లు, దేవరాజులు రేవతి, జయ గౌరీలు వ్యవహరించారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎన్నికైన విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం ఈనెల 28శ్రీ రవీంద్ర భారతి హైదరాబాద్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎన్నికైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాథోడ్ సుభాష్, ఆబిద్ అలీ, ఉపాధ్యాయులు సాగర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు..

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆయా పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉపన్యాస విభాగంలో సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థి రాజేశ్వర్, కౌటాల కేజీబీవీ విద్యార్థి కోహిమా, జనకాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థి మరియాదాస్ ఎంపికయ్యారు. పాటల పోటీల విభాగంలో సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థి వరప్రసాద్, రాసిమెట్ట ఆశ్రమ పాఠశాల విద్యార్థి వెన్నెల, చింతలమానపల్లి కేజీబీవీ విద్యార్థి స్వాతి, డ్రాయింగ్ విభాగంలో కొంచవెల్లి జెడ్పీఎస్ఎస్ విద్యార్థి షర్మిల, వాంకిడి ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి కళ్యాణి, పెంచికల్‌పేట కేజీబీవీ విద్యార్థి శ్రావ్య, రచన విభాగంలో జనకాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థి దివ్యశ్రీ, బెజ్జూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రిహాన్ హుస్సేన్, లింగాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థి నవ్యశ్రీ ఎంపికయ్యారు.

గ్రూప్-4లో జిల్లావాసికి ఫస్ట్ ర్యాంక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీఎస్పీఎస్సీ గత సంవత్సరం జూలై ఒకటో తేదీన నిర్వహించిన గ్రూప్-4 ఫలితాలు శుక్రవారం ప్రకటించారు. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ శివకృష్ణ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించారు. 300 మార్కులకు గాను 220 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందారు. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ సత్యనారాయణ, వాణిశ్రీ దంపతుల కుమారుడు శివకృష్ణ. సత్యనారాయణ జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో విధులు నిర్వహిస్తుండగా శివకృష్ణ అదే పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాడు. ట్రిబుల్ ఐటీలో సీటు సంపాదించారు. అనంతరం సింగరేణిలో నిర్వహించిన ఉద్యోగానికి 12వ ర్యాంకు సాధించి ప్రస్తుతం కాసిపేట గనిలో విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా గ్రూప్-4 ఫలితాల్లో ప్రథమ స్థానం సంపాదించి అందరి మన్ననలు పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు వస్తుందని ఊహించలేదన్నారు.



జిల్లాలో 646 మంది ఎంపిక

గ్రూప్-4 పరీక్షల్లో జిల్లాలో మొత్తం 8251 మంది దరఖాస్తు చేసుకోగా మొదటి పేపర్‌కు 7245 మంది, రెండో పేపర్‌కు 7198 మంది హాజరయ్యారు. అయితే టీఎస్పీఎస్సీ తాజాగా ప్రకటించిన ఫలితాలు జిల్లాకు 220 మార్కులతో ప్రథమ ర్యాంకు రాగా, చివరి కటాఫ్ మార్కులుగా 130 తీసుకోవడంతో మొత్తం 646 మంది జిల్లా నుండి ప్రాథమికంగా ఎంపికయ్యారు.

18న పది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



ప్రతిభా పరీక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కౌటాల

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్‌టెస్టును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సిరికొండ నితీశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్‌హాలులో మండల విద్యాధికారి సోమయ్యతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 18న టాలెంట్‌టెస్టు అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ టాలెంట్‌టెస్టుకు పదో తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ అధ్యాయనం పోరాటమనే ఆచరణాత్మక నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత శక్తిని వెలికితీసిలా ప్రోత్సహిస్తుందన్నారు. విద్యారంగ సమస్యలపై ఎళ్లవేళల పోరాడుతూ విద్యార్థులు చదువులో ముందుండాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సిద్ధం చేయడం, పరీక్షలపై భయం లేకుండా నిర్భయంగా రాసేందుకు ఇలాంటి ప్రతిభా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. చుక్క రామయ్య మాజీ శాసన మండలి సభ్యులు డాక్టర్ కె నాగేశ్వర్‌తో కొత్త సిలబస్ ఆధారంగా మల్టిబుల్ చాయిస్ రూపంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో రూపొందించిన ప్రశ్నాపత్రలతో ప్రతిభ పరీక్ష ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, వేకువ ఫౌండేషన్ నిపుణులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ లక్ష్య సాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థ లక్ష్య సాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఉపరితల గని వద్ద మల్టీ డిపార్టుమెంట్ కమిటీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ నిజాయితీగా సంస్థను మనది అనుకొని పనిచేయాలన్నారు. సింగరేణి సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్తులో లక్ష్య సాధనకు ప్రతి ఒక ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఉద్యోగులు, యంత్రాల పనితీరు, గణాంకాలను క్లుప్తంగా వివరించారు. సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. భవిష్యత్ తరాలకు సింగరేణి సంస్థను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం నాయిని ఉమాకాంత్, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఏజీఎం(ఈఅండ్ఎం) తిరుమలరావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

2024-25 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 9వ తరగతిలో ప్రవేశానికి 1017 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 735 మంది హాజరయ్యారు. 11వ తరగతిలో ప్రవేశానికి 1529 మంది దరఖాస్తు చేసుకోగా 1195 మంది హాజరయ్యారు. పరీక్షలను ఇన్‌చార్జి డీఈఓ ఉదయ బాబు, నవోదయ ప్రిన్సిపాల్ చక్రపాణి సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించారు.

మొరం రవాణ అరికట్టాలని వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని చారిగాం రోడ్‌లో గుట్టలను తవ్వి మట్టిని అమ్ముకొని వ్యాపారం చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన జాడి దీపక్ శనివారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు అదుబాటులో లేరని త్వరలోనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జాడి దీపక్ తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మొరం రవాణను అరికట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
ఆదివారం | ఫిబ్రవరి 11, 2024 | www.navatelangana.com

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన సురిమిళ్ళ వేణుకు శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోశిక మనోజ్ కుమార్ మాట్లాడుతూ మాల సామాజిక వర్గానికి చెందిన వేణు చైర్మన్ కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే మున్సిపల్ అభివృద్ధి, మాల సంక్షేమ సంఘ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం చైర్మన్ వేణుని శాలువాతో సత్కరించి అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమానికి మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గరిసె రామస్వామి, ఉపాధ్యక్షులు జువాజి నందయ్య, ధోనిపెల్లి లింగయ్య, ముఖ్య సలహాదారుడు పసరగొండ రాజయ్య, పండుగ శ్రీనివాస్, సూరిమల్ల రామచందర్, కర్రె శ్రీనివాస్, పీక సతీష్ బాబు, కిరణ్, తలారి సమ్మయ్య, కొండ పవన్, ధోనిపల్లి శరన్, మిట్టపల్లి రాజలింగు, నిక్కీ జేమ్స్, శీలం సాయి పాల్గొన్నారు.

16న సమ్మెను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జైపూర్

జాతీయ కార్మిక సంఘాలు ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎస్టీపీపీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్టీపీపీ ఏర్పాటులో భూములు నష్టపోయిన కుటుంబాల వారికి పర్మనెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదీనంలో గల ఇతర పవర్ ప్రాజెక్టులో కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలు ఎస్టీపీపీలో కూడ అమలు చేయాలని, కాలుష్య భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్టీపీపీ ఏర్పాటుతో ప్రభావిత గ్రామాలైన ఎల్కంటి, పెగడపల్లి, గంగిపల్లి, జైపూర్ గ్రామాల వారికి తీవ్రంగా అన్యాయం జరిగిందని ఆయా గ్రామాలకు చెందిన వారు సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు.

పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

- మంచిర్యా కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

10వ తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని, జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉంచే విధంగా కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్యతో కలిసి విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి పరీక్షలు-సన్నద్ధత కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరిస్తూ రానున్న 45 రోజులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని అన్నారు. ప్రతి రోజు విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా తగు ప్రణాళిక రూపొందించుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ, ప్రతి ఒక్కరు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తయిందని, రివిజన్‌పై దృష్టి పెట్టాలని, ప్రతి విద్యార్థి పట్ల సూక్ష్మస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, రానున్న పదవ తరగతి వార్షిక ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత, అత్యుత్తమ గ్రేడ్ పాయింట్ల సాధనే ధ్యేయంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం మెనూ ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. టేస్ట్ రిజిస్టర్ ప్రతి రోజు నిర్వహించాలని, ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఉంచాలని, బియ్యం నిల్వలు ప్రతిరోజు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి పాఠశాలలో మెనూ బోర్డ్ పెయింట్‌తో రాయించాలని, చెడిపోయిన, పురుగు పట్టిన బియ్యం వచ్చినట్లయితే వెంటనే సంబంధిత తహసిల్దార్, జిల్లా విద్యాశాఖ అధికారికి వ్రాత పూర్వకంగా తెలియజేయాలని





అన్నారు. మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం అందించాలని, వారం రోజులలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు పాఠశాలలను సందర్శిస్తారని, ప్రతి ఒక్కరు బాద్యతగా తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించినా, సూచనలు పాటించకపోయినా అధికారులు తీసుకొనే చర్యలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. పాఠశాలలలో పేరెంట్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించాలని, గత పరీక్షల ప్రశ్నాపత్రాల ద్వారా విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెంచాలని, ఎలాంటి అపోహలు, భయం లేకుండా పరీక్షలు రాసే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగము సహాయ కమిషనర్ దామోదర్ రావు, డీసీఈబీ కార్యదర్శి భీమ్ రావు, సహాయ కార్యదర్శి కుమారస్వామి, విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

నిరక్షరాస్యులకు చదువు చెప్పడంతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం లక్షెట్టిపేట మండలం చందారం గ్రామంలో 100 రోజుల పాటు కుట్టు శిక్షణ పొందిన మహిళలకు, పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుట్టు శిక్షణ కేంద్రంలో ఉచితంగా శిక్షణ పొంది నైపుణ్యం సాధించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. పరీక్ష రాసిన మహిళల కు జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేయడం జరుగుతుందని జిల్లా వయోజన విద్యా శాఖ ప్రాజెక్టు అధికారి ఏ. పురుషోత్తం నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్రావు, జిల్లా వయోజన విద్యాశాఖ డీఆర్పీలు కొండు జనార్ధన్, పోకల వెంకటేశ్వర్లు, కే.అశోక్ రావు, పాఠశాల హెడ్మాస్టర్ హరినాథ్, గ్రామ కార్యదర్శి, కుట్టు శిక్షణ కేంద్ర శిక్షకురాలు మంజుల పాల్గొన్నారు.

12న మార్కండేయ జయంతి



నవతెలంగాణ-నస్పూర్

పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ దుర్గామాత దేవాలయంలో ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించే మార్కండేయ జయంతిని నస్పూర్ ప్రజలు విజయవంతం చేయాలని, దేవాలయ కమిటీ సభ్యులు, పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జయంతిని పురస్కరించుకొని ఉదయం గం 6.30ని. లకు అభిషేకం నిర్వహించబడుతుందని, 10 గంటలకు జెండా ఆవిష్కరణ, మధ్యాహ్నం1 గంటకు అన్న వితరణ, సాయంత్రం 6:30 గంటలకు లలిత పారాయణం ఉంటుందన్నారు. ముఖ్యంగా శరత్ మ్యాక్స్ విజన్, హన్మకొండ వారి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని, దీనిని నస్పూర్ పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పరీక్షల అనంతరం ఆపరేషన్ చేయించుకునేవారు సింగరేణి హెల్త్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కొండ శ్రీనివాస్, శర్వానంద్, శంకర్, బండి పద్మ రాజన్న, రవీందర్, రాములు, కోటేష్, పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు బొడ్డయ్య, రాజబాబు, రమేష్, సంపత్, శంకరయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పని చేస్తుందని తెలిపారు. దీర్ఘకాలికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, కాంగ్రెస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్ రెడ్డి, ముత్యం రాజన్న, ఏనుగు సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆదివాసుల సంప్రదాయాలను కాపాడుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

సమాజంలో ఆదివాసీలు ప్రత్యేక గుర్తింపు పొందారని, ఆదివాసీలు సంప్రదాయాలను కాపాడుకుంటూనే, పిల్లలను ఉన్నతంగా చదివించి ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా జాతి పెద్దలు కృషి చేయాలని ఓరియెంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యాపాల్ రావు(చిట్టిబాబు) అన్నారు. మండలంలోని వెంకటపూర్ గ్రామంలోని కుర్రెఘడ్‌లోని పాహుండి కుపర్ లింగు స్వామి జాతరకు ముఖ్య అతిధులుగా హాజరైన తనను డోలు వాయిద్యాల నడుమ గుడి నిర్వాహకులు శనివారం ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన దర్బారులో పాల్గొని ప్రసంగించారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేసేలా కృషి చేయాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. వీటితో పాటు తమ నాన్న కోక్కిరాల రఘుపతి రావు, ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ సహాయసహకారాలను అందిస్తామని హామీ



ఇచ్చారు. తమ సోదరుడు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌తో మాట్లాడి ఆలయ అభివృద్ధికి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, ఆదివాసీ నాయకులు మడావి వెంకటేష్, కనక రాజు, జనార్ధన్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగు, ఎంపీటీసీ పార్వతి మల్లేష్, మెరుగు శంకర్, సిడం గణపతి, ప్రభాకర్, మడవి వెంకటేష్, అన్నం కుమార్, రషీద్, ఖలీమ్, కదిర్, పెద్దిరాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కనుకుల రాకేష్, ప్రధాన కార్యదర్శి జంగిళి రమేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షాకీర్, యూత్ వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, ప్రచార కార్యదర్శి దుర్గం గణేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



నవతెలంగాణ-దండేపల్లి

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ అధికారినిలు మౌనిక, లిప్సికలు పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. బేటి బచావో బేటి పడావో పథకం, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం, పనిచేసే చోట లైంగిక వేధింపులు, గృహ హింస, మిషన్ శక్తి, లింగ వివక్ష లింగ సమానత్వం బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, గుడ్ టచ్ బాడ్ టచ్, మహిళ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ 1098, డైల్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్ లైన్ వంటి అంశాలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభ, కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారిని మంజుల పాల్గొన్నారు.

ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజయం

నవతెలంగాణ-నస్పూర్

ఢిల్లీలో నిర్వహించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటర్ సర్కిల్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచిందని టీం శిక్షకులు ఈఎస్ శ్యామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలో మొత్తం 16 జట్లు పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి హైదరాబాద్ టీం 3వ స్థానంలో నిలిచిందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాన్ని సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యురాలు అంజనీ దేవి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును పరిశీలించి, ఖైదీలకు అందిస్తున్న ఆహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే తప్పులు చేయకుండా ఉంటారన్నారు. 18 నుండి 22 సంవత్సరాల యువ ఖైదీలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వకేట్ నరహరి, ప్యార లీగల్ వాలంటీర్ జయరాజ్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో ఇద్దరికి జైలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానిఇ చెందిన నాంపల్లి రామక్క భర్త రాజయ్య, కోట పోసమ్మ భర్త నారాయణ అనే ఇద్దరు గుడుంబా అమ్మే వ్యక్తులను గతంలో లక్షెట్టిపేట తహసీల్దార్ ముందు బైండోవర్ చేయగా అట్టివ్యక్తులు తిరిగి మళ్లీ అదే నాటు సారాయిని అమ్ముతూ పట్టుబడ్డారు., బైండోవర్ ఉల్లంఘించినందున వారికి నోటీసు జారీ చేసి జరిమానా విధించారు. ఇద్దరు వ్యక్తులు జరిమానాను చెల్లించనందున తహసీల్దార్ లక్షెట్టిపేట బి.రాఘవేంద్ర రావు బైండోవర్ కాలపరిమితి వరకు జైలు శిక్ష విధించగా రిమాండ్ నిమిత్తం అదిలాబాద్ జిల్లా జైలుకు శనివారం పంపినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.బాబా తెలిపారు.

ఆర్కే-న్యూటెక్ గనిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే న్యూటెక్ గనిలో శనివారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాన్ని ఆ డిపార్ట్‌మెంట్ బృందం కన్వీనర్, ఎస్ఓ టు జీఎం రఘు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ స్థితిగతులపై ఉద్యోగుకు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగేతే సంస్థ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకొనేందుకు ప్రతిఒక్కరూ వృషి చేయాలన్నారు. పని స్థలాల్లో రక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన బొగ్గును సకాలంలో వినియోగదారులకు చేరవేసినప్పుడే ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. భూగర్భ గనుల్లో ఖర్చు తగ్గిస్తూ, యంత్రాల పని గంటలు పెంచుకోవల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులు విధులకు గైర్హాజరు కాకుండా ఉండాలన్నారు. గనుల్లో వివిధ కేటగిరి పనులు స్వీకరించేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్మికులకు మెరుగైన డిమాండ్లు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి బాజీ సైదా, గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు, మల్టీ డిపార్టుమెంటల్ బృందం సభ్యులు ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, డీవైఎఫ్ఎం నరేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో అన్యాయం

పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్



నవతెలంగాణ-హాజీపూర్

విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరికాదని, బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలిని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి రూ.21389 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. మొత్తం రూ.2,75,891 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో ఇది కేవలం 11.3 శాతం నిధులు మాత్రమేనని పేర్కొన్నారు. ఎప్పటినుండో విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు విద్యారంగం బాగుపడాలంటే కనీసం విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని కోరుతున్నారన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇప్పటికే దాదాపు రూ.6500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు కనీస సదుపాయాలు లేక కూనరిల్లుతున్నాయన్నారు. విద్యారంగం బాగుపడాలంటే ఈ నిధులు సరిపోవన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాహుల్, రాజ్ కుమార్, సిద్ధార్థ, కార్తీక్, అజయ్ పాల్గొన్నారు.

జైపూర్ : ప్రభుత్వం విద్యారంగాన్ని నిరాశపర్చిందని పీడీఎస్ నాయకులు సికిందర్ పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీలో శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి బడ్జెట్‌లో విద్యారంగానికి 21,389 కోట్లు కెటాయించడం నిరాశకు గురి చేసిందని ఆవేధన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని బలోపేతానికి కృషి చేస్తామని మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్నట్లు ఉందని అన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కెటాయిస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధుల కెటాయింపును సవరించాలని అన్నారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం కెటాయించిన రూ. 500 కోట్లు కనీస సౌకర్యాలకు సరిపోవని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 11, 2024 | www.navatelangana.com

భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఏరోడ్రమ్ భూములను రెవెన్యూ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరోడ్రమ్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలం, సరిహద్దు వివరాలను అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు వొద్నల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి అన్నారు. శనివారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాజీ జెడ్పీటీసీ మేడి నారాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నరేష్‌రెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ కుర్మ రాజేంధర్‌రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ గురాల లింగారెడ్డి, మునిపెల్లి మాజీ ఉపసర్పంచ్ రాంపెల్లి రమేష్, కంజర్ ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, మండల మేర సంఘం అధ్యక్షుడు పూసాల గోవర్ధన్, నాయకులు అయిట్ల సుధర్శన్, కిరణ్ ఠాకూర్, బాపట్ల ఆశన్న, రమణ, బాపట్ల అరవింద్‌లు ఉన్నారు. వారి వెంట అట్ల చిన్నరాంరెడ్డి, తునికి నారాయణ, ఈటెల శ్రీను, యూత్ అధ్యక్షులు నగేష్ ఉన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో విద్యా రంగానికి 30శాతం నిధులు కేటించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి పెద్దపీట వేయాలని అన్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తుంగలో తొక్కి ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకి సపోర్ట్ చేసిందని విమర్శించారు. అందుకే విద్యార్థి సంఘాలుగా నియంత పాలనకు చరమగీతం పాడాలని నిర్ణయించి గద్దె దించమన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి పెద్దపీట వేసి ప్రభుత్వ విద్య సంస్థలను కాపాడాలన్నారు. పెండింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో సోషల్ వెల్ఫేర్ కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో కాస్మోటిక్స్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తానని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలపై శ్రద్ధ పెట్టి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఫీజుల దోపిడీని అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు స్వాతి, మౌనిక, స్వప్న పాల్గొన్నారు.

ఆశా వర్కర్లతో సర్వేలు చేయించొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలో ఒకటైన గృహలక్ష్మి పథకం మిస్ అయిన ప్రజలకు యాప్ డౌన్లోడ్ చేసుకొని, సర్వేలు చేయాలని ఆశాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అలాంటి ఒత్తిడికి ఆశాలను గురి చేయొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. శనివారం డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు నెలల నుంచి పారితోషకాలు లేవన్నారు. ఆశాలకు బ్యాలెన్స్ వేసుకుందామంటే డబ్బులు లేవని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని సర్వేలు చేయమంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశాలకు ఇచ్చిన ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదని అలాంటి పరిస్థితుల్లో ఆశాలను సర్వేలు చేయమని అనడం సరికాదన్నారు. డీఎంహెచ్ఓ అధికారులకు చెప్పి సర్వేలను ఆపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, హారిక, సుజాత, సునీత పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధన దీక్షలో పారామెడికల్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైల్వేలైన్ లేని కారణంగా ఆదిలాబాద్ అభివృద్ధి వెనకబడిందని ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధన సమితి చైర్మెన్ నారాయణ అన్నారు. ఆర్ అండ్ బి వద్ద చేపట్టిన రిలే దీక్షలు కొనసాగగా శనివారం 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో లక్ష్మీ పారామెడికల్ విద్యార్థులు కూర్చున్నారు. ఈ సందర్భంగా సాధన సమితి చైర్మెన్ నారాయణ మాట్లాడుతూ రైల్వేలైన్ లేని కారణంగా ఉన్నత చదవులకు విద్యార్థులకు హైదరాబాద్ వెళ్లాలంటే ఎంతో ఖర్చు భరించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం రైల్ ద్వారా హైదరాబాద్ వెళ్లాలంటే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందన్నారు. అదే ఆర్మూర్ రైల్వేలైన్ అయితే 4 నుంచి 5 గంటలలోపు చేరుకోవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు అఫ్సార్ ఖాన్, రఫీక్, నరేందర్, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రమేష్ ఆదేశించారు. శనివారం మండలంలోని ఎలుకపెల్లి, ఎల్లూరు, అగర్‌గూడ గ్రామాల్లో పల్లెప్రగతి పనులను ఆయన పరిశీలించారు. ఎల్లూరు గ్రామంలో కోయచిచ్చాల పాఠశాల చేతిపంపు వద్ద నీరు నిల్వ ఉండడంతో నిల్వ లేకుండా చూడాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. నర్సరీలను పరిశీలించిన ఆయన పనులను త్వరగా పూర్తిచేయాలని, ఉపాధిహామీ చట్టంలో కూలీలకు పని లభించేలా చూడాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. అగర్‌గూడ గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, కిష్టయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ముధోల్ సీఐకి సన్మానం

నవతెలంగాణ-ముధోల్

ఇటీవల బదిలీపై వచ్చిన ముధోల్ నూతన సీఐ మల్లేష్‌ను శనివారం తన కార్యాలయంలో చింతకుంట తండ, ఎడ్‌బిడ్ తండ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తండావాసులు జాదవ్ గడ్డేన్న, జాదవ్ అంబర్ సింగ్, రాథోడ్ గంగారాం, ఆడే బాబు ఉన్నారు.

హరీష్‌రావు వ్యాఖ్యలపై నిరసన

నవతెలంగాణ-రెబ్బెన

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి హరీష్‌రావు ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు ఇవ్వడంలేదని చేసిన వ్యాఖ్యలపై ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొంతమందిని మాత్రమే రెగ్యులర్ చేసి రాష్ట్రవ్యాప్తంగా 411 మందిని ఆపిన ఘనత హరీష్‌రావుకే దక్కుతుందన్నారు. తమ అసోసియేషన్ తరపున ఎవరు కూడా హరీష్‌రావుకు జీతాలకు సంబంధించిన వినతిపత్రం ఇవ్వలేదని, అయినప్పటికీ అసెంబ్లీలో జీతాలపై ప్రస్తావించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. గతం కంటే ప్రస్తుతం జీతాలు ప్రతినెల వస్తున్నాయని తెలిపారు. తమపై సానుభూతి ఉంటే అధికారంలో ఉండగా



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు

మిగతా వారివలే ఎందుకు రెగ్యులర్ చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ముందుకు వెళ్లేల చూడాలని హితవు పలికారు. అంతే కానీ తమను ప్రభుత్వానికి దూరం చేసే విధంగా మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 411 మందిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. నిరసనకు టీజీజేఎల్ఏ నాయకులు, అతిథి అధ్యాపక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్, సుమలత, జాన్సీరాణి, దీప్తి, ఏకలవ్య, నిర్మల పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో ఆసిఫాబాద్, వాంకిడి, మోవడ్ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో విద్యాసామర్థ్యాల పెంపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో వివిధ విషయాలపై సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇంగ్లీష్ సామర్థ్యాల పెంపుకు అమలుపరుస్తున్న 100 రోజుల కార్యక్రమాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల సమయసారణి పాటించాలన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి గిరిజన విద్యను బలోపేతం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపాధ్యాయులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాథమిక పాఠశాలలో కావాల్సిన రికార్డులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. పాఠశాల రోజువారీగా జీపీఎస్ కెమెరా ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు నిర్ణీత సమయంలో సంబంధిత వాట్సాప్ ద్వారా అందజేయాలని సూచించారు. ఈ సమావేశానికి ఎసిఎంవో ఉద్ధవ్, ఎటిడివో క్షేత్రయ్య, గిరిజన శాఖ స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, జీసిడిఓ శకుంతల, డిఆర్పి వామన్‌రావ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తిరుపతి, శ్రీనివాస్, కృష్ణారావు, ఎస్సీఆర్పిలు రాజేశ్వర్, ఆనంతి, రవీందర్ పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె పోస్టర్లను శనివారం సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మె సందర్భంగా పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో నేడు బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథిగా సీఐటీయూ ఆల్ ఇండియా కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమా, రాష్ట్ర కార్యదర్శి మధు, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు హాజరు కానున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం



సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

రూ.26వేలు ఇవ్వాలని, ప్రతి కార్మికునికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సంజీవ్, మల్లేష్, రమేష్, శంకరమ్మ పాల్గొన్నారు.

బంగారం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అమాయక గిరిజనులు, రైతులను మోసం చేస్తున్న బంగారం దుకాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా బంగారం దుకాణం యజమానులు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అమాయక గిరిజనులను, రైతులను అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నాణ్యత లేని బంగారం, వెండి అమ్ముతూ బిల్లులు, జీఎస్టీ లేకుండా బంగారం ఉన్న ధరను అధిక రేట్లకు అమ్ముతూ మోసం చేస్తున్నారన్నారు. వారు అమ్మిన బంగారాన్ని తిరిగి ఇచ్చేసినప్పటికీ అదే ధర పెట్టడం లేదన్నారు. ప్రస్తుతం పెండ్లిల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు బంగార దుకాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి గిరిజనులను కాపాడాలని కోరారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

పది విద్యార్థులు పరీక్షలు నిర్భయంగా రాయాలి

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడి నిర్భయంగా రాయాలని విద్యా నిపుణులు శ్రీనివాస్‌చారి, వరుణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని ప్రోత్సహించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషం సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడిచిన కాలం తిరిగి రాదని, సమయం ఎలా ముందుకుపోతుందో అలా ముందుకెళ్లాలని తెలిపారు. జీవితాన్ని మొట్టమొదటి మలుపు తిప్పేది పది పరీక్షలే అన్నారు. అన్నం పెట్టిన అమ్మానాన్నల ఆశలను నిరాశ పర్చవద్దంటే నిరంతరం కష్టపడి చదివి భయం లేకుండా పరీక్షలు రాస్తే విజయం వెంటే ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డి.సోమయ్య, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ సోమయ్య

రోడ్డు భద్రత అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పోలీస్‌శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మావల ఎస్సై విష్ణువర్ధన్, ఆదిలాబాద్ రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఆవశ్యకత, ట్రిపుల్ రైడింగ్ దుష్పరిణామాలు యాంటీ ర్యాగింగ్, డయల్ 100, క్రమశిక్షణ తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు ఎక్కువ యువత గురవుతున్నారని అన్నారు. యువత తమ వాహనాన్ని నడిపేటప్పుడు కుటుంబాన్ని గుర్తుంచుకొని నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ, విభాగాధిపతులు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీపీ



నవతెలంగాణ-భైంసా

మండలంలోని ఇలేగాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఎంపీపీ అబ్దుల్ రజాక్ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. స్థానిక గ్రామ పెద్దలచే సమస్యల అడగగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 80 ఉన్నప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులను, అధికారులు డిప్యూటేషన్‌పై పంపడంతో విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని తెలియజేశారు. ఏడు తరగతులకు ప్రస్తుతం ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారని, ఇక్కడ పని చేస్తున్న వారిని డిప్యూటేషన్‌పై నిబంధనలకు విరుద్ధంగా అధికారులు పంపించేశారని వారు ఫిర్యాదు చేశారు. తమకు కేటాయించిన ఉపాధ్యాయులను తమ పాఠశాలకే రప్పించాలని కోరారు. అదేవిధంగా శిథిలావస్థకు ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చడంతో పాటు అదనపు గదుల నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలను ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు బోస్లే బాజీరావు పటేల్, మహాగాం సర్పంచ్ రాకేష్, విద్యా కమిటీ చైర్మెన్ మాధరావు ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

నవతెలంగాణ-తాంసి

ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో విద్యార్థిని, విద్యార్థులకు రక్త పరీక్షలను ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత నిర్వహించారు. రక్త హీనతతో ఉన్న బాలికలకు ఐరన్ మాత్రలను అందించి మంచి ఆహారాన్ని తినాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా కస్తూరిబా బాలికలకు హైస్కూల్ పాఠశాల విద్యార్థులకు 105 మంది విద్యార్థులకు రక్తపరీక్షలను నిర్వహించామని అన్నారు. విద్యార్థులు ప్రతి రోజు గుడ్డు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తినాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సువర్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్‌తో కూడిన వస్తువులు వాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్‌తో కూడిన వస్తువులను వాడాలని నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్ సూచించారు. శనివారం పట్టణంలోని డైట్ కళాశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై జిల్లా స్థాయి డ్రామ, రోల్ ప్లే పోటీలను నిర్వహించారు. అనంతరం జిల్లాలోని ఎంపిక చేసిన 30 పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా నారాయణ, లచ్చిరాం, చంద్రశేఖర్, పొచ్చరెడ్డిలు వ్యవహరించి, విద్యార్థుల డ్రామా రోల్‌కు మార్కులు వేశారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వల్ల అనేక అనార్థలున్నాయన్నారు. వాటి గురించి విద్యార్థులకు తెలియజేయడంలో భాగంగా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలపై డ్రామ, రోల్‌ప్లే పోటీల్లో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందిస్తామన్నారు. విద్యార్థులు కూడా బాద్యతయుతంగా ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలను ఇంటితో పాటు పరిసరాల ప్రాంతాల్లో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కో ఆర్డినేటర్ కంటే నర్సయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కోల రవి కుమార్, సెక్టోరల్ అధికారులు జె. నారాయణ, సూజాత్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కలప పట్టివేత

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో జిల్లా అటవీ శాఖ టాస్క్ ఫోర్స్ అధికారులు పక్క సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన వడ్రంగి నివాల్కర్ మహాదేవ్ ఇంట్లో అక్రమంగా టేకు కలప నిల్వ ఉండటంతో వారిని పట్టుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ.28 వేలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి వాహబ్ ఆహ్మద్ మాట్లాడుతూ అక్రమంగా కలప నిల్వ ఉన్నట్టు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. తనిఖీలు నిర్వహించేటప్పుడు అధికారులపైన ఇంటి యజమాని దుర్భాషాలాడుతూ బెదిరించి, విధులకు అడ్డుపడ్డారని పేర్కొన్నారు. అటవీ అధికారుల విధులకు అడ్డు పడటమే కాకుండా బెదిరించడంతో వారిపై కేసు నమోదు చేయాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్ఓ పాండురంగ్, ఎఫ్‌బీఓ టాస్క్ ఫోర్స్ శ్యామ్ సుందర్, ఎఫ్‌బీఓ దేవేందర్ సిబ్బంది పాల్గొన్నారు.